


27,28న ఆటల పోటీలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఈనెల 29న హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు పురస్కరించుకొని జిల్లాలోని అన్ని విద్యా సంస్థలల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 27,28 తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలతో పాటు కళాశాలల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈనెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవం వేడుకల్లో భాగంగా బహుమతి ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

మన్యంలో ఇసుక రీచ్‌ల్లేవా?

ఉపాధి కోల్పోయిన కూలీలు
పనుల్లేక ఖాళీగా ఉన్న ట్రాక్టర్ యజమానులు



పనుల్లేక ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు

ప్రజాశక్తి - సాలూరు

మన్యం జిల్లా లో ఇసుక రీచ్ ల్లేవని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఇసుక రీచ్ ల్లేవని, పక్క జిల్లా రీచ్‌ల నుంచి తీసుకొచ్చి వినియోగదారులకు సరఫరా చేస్తున్నామని చెప్పడం గమనార్హం. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తోంది. ఇంతవరకు ఇసుక విధానాన్ని ప్రకటించలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మాత్రం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని కూటమి పార్టీలు ప్రకటించాయి. గత ప్రభుత్వ హయాంలో ఇసుక నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుకని తాజాగా ప్రభుత్వం ఉచితమంటూనే విక్రయించింది. బొబ్బిలిలో ఉన్న స్టాకు పాయింట్ నుంచి ట్రాక్టర్ ఇసుకను సాలూరు ప్రాంతానికి తరలించడానికి రూ.5వేలు వరకు ఖర్చయింది. దీంతో తడిసి మోపెడవుతోందని వినియోగదారులు విరమించుకున్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్ లున్నాయి. కాకులతోట, గుమడాం వద్ద ఇసుక రీచ్‌లు గతంలో వుండేవి. అయితే ఈ రీచ్‌ల నుంచి ఇసుక తరలింపుపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ట్రాక్టర్ యజమానులకు చేతినిండా పని లేకుండా పోయింది.

పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో సుమారు 200 ట్రాక్టర్లు వున్నాయి. గృహ నిర్మాణ పనులు, అపార్ట్ మెంట్ నిర్మాణాలకు సంబంధించి ఇసుక రవాణా చేయడమే ట్రాక్టర్ యజమానులకు ప్రధానమైన పని. గత రెండు నెలలుగా ఇసుక తరలింపు పనులు లేకపోవడంతో యజమానులు, వాటిపై ఆధారపడి బతికే కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక రవాణాపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో భవన నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. ఫలితంగా వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు కూడా చేతినిండా పని లేని పరిస్థితి ఏర్పడింది. అసలే పట్టణ ప్రాంతంలో భవన నిర్మాణ రంగం అంతంత మాత్రంగానే ఉంది. ఉచిత ఇసుక విధానం అమలుపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోని కారణంగా ట్రాక్టర్ యజమానులు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ట్రాక్టర్ యజమానుల్లో కూడా అనేకమంది నిరుద్యోగ యువకులే వున్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ చదువుకుని ఉద్యోగాలు రాకపోవడంతో స్వయం ఉపాధి లక్ష్యంగా వారు ట్రాక్టర్లను కొనుగోలు చేసి నడుపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎక్కువమంది ట్రాక్టర్ యజమానులు ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పులు తెచ్చి వాహనాలను కొనుగోలు చేసిన వారే వున్నారు. రోజువారీ, నెలవారీ వాయిదా పద్ధతిలో ఫైనాన్స్ సంస్థలకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. గడచిన రెండు నెలలుగా ఇసుక రవాణా పనులు లేకపోవడంతో ట్రాక్టర్ యజమానులు ఇఎంఐలు చెల్లించలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మన్యం జిల్లాలోని వేగావతి, వట్టిగెడ్డ, సువర్ణముఖి, గోముఖి, నాగావళి నదుల పరివాహక ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు గతంలో వుండేవి. ఇప్పుడు కూడా అవే రీచ్ ల్లో ఇసుక నిల్వలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ఎప్పుడు ప్రకటిస్తుందా అని ట్రాక్టర్ యజమానులు, భవన నిర్మాణ కార్మికులు, కూలీలు ఎదురు చూస్తున్నారు.

రెండు నెలలుగా పనుల్లేవు

ఇసుక తరలింపుపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో రెండు నెలలు గా పనుల్లేవు. ఫలితంగా యజమానులు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన హామీ ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి.

పతివాడ శివ,
ట్రాక్టర్ యజమానుల సంఘం అధ్యక్షుడు,
సాలూరు

మరో పని చేయలేం

ఇసుక కొరత లేకపోవడంతో భవన నిర్మాణ పనులు జరగడంలేదు. దీంతో రెండు నెలలుగా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది.

మజ్జి తారక, కందిరివలస

ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక తరలింపుపై ఆంక్షలు విధించడంతో ట్రాక్టర్లకు పని లేదు. మాకు పని లేదు. రెండు నెలలు గా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

రాయల తిరుపతి, ట్రాక్టర్ డ్రైవర్,
గుంటమామిడివలస

మహిళలు లక్షాధికారులుగా ఎదగాలి : కలెక్టర్



స్వయంసహాయక సంఘ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్వయం సహాయక సంఘాల సభ్యులు లక్షాధికారులుగా ఎదగాలని, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే స్థాయికి జిల్లాలోని సంఘాలు అభివృద్ధి సాధించాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన లఖ్ పతి దీదీ కార్యక్రమంలో మహిళా సంఘాలకు రూ.66.14 కోట్లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ లఖ్ పతి దీదీ కింద స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళలందర్నీ లక్షాధికారులుగా చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ప్రతి గ్రామ సంఘానికి ఐదు గురు చొప్పున జీవనోపాధులను మెరుగుపర్చి లక్షాధికారులుగా చేయడమే ఉద్దేశించడం జరిగిందని అన్నారు. స్వయం సహాయక సంఘాలు వారికి ఇచ్చిన రుణంతో అభివృద్ధి సాధించాలని, సంపద సృష్టికి వ్యాపారాలు, వస్తువుల తయారీ యూనిట్లు స్థాపించాలని సూచించారు. గ్రామాల్లో నిరుపయోగంగా గల భవనాలను యూనిట్ల స్థాపనకు వినియోగించుకోవాలని, రిపేర్లకు, యూనిట్ల స్థాపనకు అవసరమైన ప్రోత్సాహాన్నందిస్తామని తెలిపారు. నలుగురికి ఉపాధి చూపించే స్థాయికి సంఘాలు ఎదగాలని కలెక్టరు తెలిపారు. రుణాలు తిరిగి చెల్లించుటలో మన రాష్ట్రంలో మహిళా సంఘాలు ముందున్నాయని, బ్యాంకర్లకు మంచి నమ్మకం ఉందని, రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మహిళా సంఘ సభ్యులంతా అక్షరాస్యులుగా మారాలని, వారికి చదువు నేర్పే కార్యక్రమాలు చేపట్టాలని, సైబర్, ఆన్లైన్ బ్యాంకింగు మోసాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో వచ్చే 5 సంవత్సరాల్లో 15 మండలాలలో 46,273 మంది సభ్యులకు లక్ష రూపాయిలు ఆదాయం వచ్చేలా వారికి వివిధ రకాల ఋణ సదుపాయం కల్పించి జీవనోపాధి పెంపొందించి తద్వారా లక్షాధికారులుగా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో 5212 మంది సభ్యులకు రూ.56.64 కోట్లు బ్యాంకు లింకేజిగా, 124 మంది సభ్యులకు సిఐఎఫ్ కింద రూ.60లక్షలు, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద 117 మందికి రూ.8.90 కోట్లు వెరసి 5453 మందికి రూ.66.14 కోట్లు చెక్కును అందజేశారు. ఇందులో భాగంగా ఐదు గురు ఉత్తమ సభ్యులకు, ఐదు గ్రామ సమాఖ్యలకు ప్రశంసాపత్రాలు అందజేసారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, ప్రజాప్రతినిధులు, మహళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొమరాడ : స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఎపిఎం వెంకటరమణ అన్నారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో లక్ పతి దీదీ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు వెలుగు అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 2024-25 సంవత్సరానికి గనాఊ బ్యాంకు లింకేజీ ద్వారా 26 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.2.38 కోట్లు రుణాలు అందజేసినట్లు తెలిపారు. రుణాలు అందుకున్న మహిళా సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వ్యాపారాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సమైక్య సభ్యులు, వెలుగు సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్ అన్నారు. స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో డ్వాక్రా సంఘ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ నెలకు రూ.10వేలు సంపాదించుకునేందుకు లక్ దిది ద్వారా ప్రభుత్వం రుణ సదుపాయం అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మండలంలోని 74 సంఘాల్లో 786 మంది లబ్ధిదారులకు రూ.కోటీ35 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎం బి.శివున్నాయుడు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, టి.రమేష్, మహిళా సమైక్య అధ్యక్షులు పి.సుజాత, మాజీ మహిళా సమైక్య అధ్యక్షులు కె.లలిత కుమారి, ఎన్ఎఫ్‌డిఒ సిసి వై.ఆనందరావు, విఒఎలు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పరంధామను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు గంగునాయుడు

బట్లభద్ర మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని బట్లభద్ర గ్రామానికి చెందిన మేరువ పరంధామ భార్య, కుమార్తె మరణాలు దారుణమని సిపిఎం నాయకులు కొల్లి గంగునాయుడు అన్నారు. ఆదివారం పరంధామను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యానికి రెండు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఉదంతాం పునరావృతం కాకుండా దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయపార్వతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్‌మోహన్‌రావు కోరారు. అంతేకాకుండా డెంగీ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని గిరిజన గ్రామాలు ఆనుకొని ఉన్న నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేకమంది డెంగీ బారిన పడి మరణిస్తున్నారన్నారు. దీని నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజారోగ్యం పట్ల బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గరుగుబిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ తప్ప మరే పెన్షన్ స్కీం వద్దు : యుటిఎఫ్



యుటిఎఫ్ స్వర్ణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో (యూనిఫైడ్ పెన్షన్ స్కీం) యుపిఎస్ అమలు చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అదనంగా వనగూరే ప్రయోజనం ఏమీ లేదని, కావున పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని, వేరొక దాన్ని అంగీకరించేది లేదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన యుటిఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన జిల్లా స్వర్ణోత్సవాలకు సంబంధించి తన గోడ పత్రికను ఉపాధ్యాయ సంఘాలకు నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగి ఎలాంటి కంట్రిబ్యూషన్ చెల్లించకుండా ఇచ్చే పాత పెన్షన్‌ను పునరుద్ధరించకుండా ఆంధ్రప్రదేశ్లో అమలు చేయడానికి ప్రయత్నించిన జిపిఎస్ లాంటి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిందన్నారు. ఈ విధానంలో కన్యుకేషన్ పెరిగిన పిఆర్‌సిలు, డిఎ విషయాలు లేవని తెలిపారు. 10 శాతం ఉద్యోగుల నుంచి కట్టించుకునే సొమ్ము షేర్ మార్కెట్లో పెట్టడం వల్ల ఉద్యోగులకు ఉపయోగం కాదని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహనరావు, ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యారంగా సంస్కరణ వల్ల ప్రభుత్వ విద్యారంగం విచ్ఛిన్నమై విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని తెలిపారు. పని సర్దుబాటు అవసరం మేరకు చేస్తామని చెప్పి ఇప్పుడు గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. అలాగే అక్టోబర్ 20, 21 తేదీల్లో జరిగే జిల్లా స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్‌రావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి : ఎపిటిఎఫ్

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో ప్రవేశపెట్టిన కొత్త పెన్షన్ పథకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో ప్రకటించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ వంటిదేనని, సర్వీసు వ్యవధితో సంబంధం లేకుండా అందరికీ పాత పెన్షన్ వర్తింపజేయడమే న్యాయ సమ్మతమని ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీముకు మరో రూపమే తప్ప పాత పెన్షన్ విధానం కాదన్నారు. సిపిఎస్ వలే ఉద్యోగి జీతంలో నుండి 10శాతం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రానున్న కొత్త పెన్షన్స్ పథకాన్ని ఎపిటిఎఫ్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఉద్యోగులకు ప్రతికూలమైన ఈ పథకాన్ని తిరస్కరిస్తూ పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

వైరల్ త్రంబోసైటోపినియ కారణంగానే తల్లీకుమార్తె మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జియ్యమ్మవలస మండలం బట్లభద్రకు చెందిన ఎం.దుర్గమ్మ (40), ఎం.చైతన్య (20) వైరల్ త్రంబోసైటోపినియ కారణంగా మృతి చెందారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయ పార్వతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దుర్గమ్మకు ఆగస్టు 13న జ్వరంతో పార్వతీపురంలోని సౌజన్య ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారని, అనంతరం విజయనగరం మెడికవర్ ఆసుపత్రికి 22న రిఫర్ చేశారని వివరించారు. 23న ఉదయం వైరల్ త్రంబోసైటోపినియతో ఆమె మృతి చెందారని తెలిపారు. ఇంటింటి జ్వరాల సర్వేలో భాగంగా ఆమెకు జ్వరం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని అన్నారు. మలేరియా, డెంగీ సందేహంతో ఆర్‌డిటి పరీక్ష నిర్వహించగా, అందులో నెగిటివ్‌గా ఫలితం వచ్చిందని తెలిపారు. మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించామన్నారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో విజయనగరం మెడి కవర్ ఆసుపత్రికి రిఫర్ చేశారని ఆమె వివరించారు. ఎం.చైతన్య తగరపువలసలో బిటెక్ చదువుతోందని, ఆర్‌డిటి పరీక్షలలో సికిల్ సెల్ ఎనీమియాగా గుర్తించామన్నారు. తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా తుది పరీక్షల నిర్వహణకు చైతన్య అంగీకరించలేదని ఆమె వివరించారు. తల్లి దుర్గమ్మను చూడ్డానికి వచ్చిన చైతన్యకు ఆగష్టు 15న జ్వరం ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే పార్వతీపురంలోని సౌజన్య ప్రైవేటు ఆసుపత్రిలో ఒపి విధానంలో చికిత్స పొందారని, అనంతరం 19న చేసిన పరీక్షల్లో వైరల్ త్రంబోసైటోపినియ ఉన్నట్లు గుర్తించినట్టు ఆమె చెప్పారు. ఈనెల 23 మధ్యాహ్నం నాటికి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వెంటనే శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి రిఫర్ చేశారని వివరించారు. ఈనెల 23న రాత్రి వైరల్ త్రంబోసైటోపినియతో ఆమె మృతి చెందారని తెలిపారు. ఈ మేరకు గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఒతో కలిసి స్వయంగా పర్యటించామని ఆమె చెప్పారు. గ్రామంలో ఇంటింటా జ్వరాల సర్వే, ఏంటి లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేశామన్నారు. వైద్య శిబిరాన్ని నిర్వహించామని, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల అవగాహన నిర్వహించామని అన్నారు. దోమల వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించామని, గంబోషియా చేప పిల్లల గూర్చి మత్స్య శాఖను సంప్రదించామని తెలిపారు.

వ్యాధులపై అవగాహన పెంచాలి : ఎమ్మెల్యే



వైద్య శిబిరంలో మాట్లాతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వాతావరణ మార్పుల వల వ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉన్నాయని, ఇలాంటి సమయంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వైద్య సేవలు అందించడం చాలా ఉపయోగకరమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని తోటపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద తోటపల్లి ఆలయ అభివృద్ధి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా ప్రజలకు వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. మానసిక వ్యాధి బాధితులను మళ్లీ ఆరోగ్యవంతులుగా మారేందుకు చేస్తున్న ప్రయత్నం చాలా మంచిదన్నారు. సమాజంలో అలాంటి వ్యాధిగ్రస్తులకు మానవత్వంతో సేవచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ముందుకు సాగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం అవసరమన్నారు. ప్రభుత్వంతో పాటుగా, స్వచ్ఛంధ సంస్థలు కూడా ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. ఈ సందర్భంగా రూ. 11,116 చెల్లించి టిటిడిఎస్‌టిలో సభ్యత్వాన్ని ఎమ్మెల్యే తీసుకున్నారు. దేవస్థానం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, గౌరవ అధ్యక్షులు హోదాలో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు. అనంతరం సందర్భంగా 276 స్వయం సహాయ సంఘాలకు రూ.12.24 కోట్ల రూపాయల రుణాన్ని అందించారు. ఉత్తమ విఒఎలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ తరుచుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు పరిష్కరించగలమన్నారు. ఇందుకోసం వైద్యులు సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన పంటలను ఆహారంలో తీసుకోవాలని, పోషకాలు గల పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి మాట్లాడుతూ వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్స అందించడం కోసం స్వచ్ఛంధంగా పాల్గొన్న వైద్యులను అభినందించారు. వైద్యుల సహకారం, భాగస్వామ్యం ఉన్నప్పుడే ఇలాంటి శిబిరాలు నడపగలమని, వారి కృషి, సేవలు వెలకట్టలేనివని అన్నారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న వారికి వికాసం కల్పించడంలో మనోబంధు కృషి అభినందించదగ్గదని అన్నారు. మనోబంధు వ్యవస్థాపక ట్రస్టీ భూపతిరాజు రామకష్ణరాజు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మానసికంగా వేదనకు గురవుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని దీనికి కారణం అధిక వత్తిడేనని అన్నారు. వీరి సంఖ్య తగ్గించేందుకు వివిధ రూపాల్లో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా మానసిక వ్యాధి గ్రస్థులు కనిపించినప్పుడు వారిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళి వారికి అవసరమైన సేవలు అందించి వారిని ఆరోగ్యవంతులను చేసి వారి ఇంటికి పంపిస్తున్నామ న్నారు. జట్టు ఆశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ పారినాయుడు అధ్యక్షతన జరిగిన వైద్యశిబిరంలో వైద్యులు వాడ్రేవు నగేష్, రామానంద సత్పతి, సుప్రియా సత్పతి, బోగి ఈశ్వరరావు, యాళ్ల వివేక్, వై. పద్మజ, జి. ప్రభాకర్, పి. భాస్కరనాయుడు, ఎస్. ప్రతాప్ కుమార్, పి.రాజేష్, జి. శ్రావణ్ కుమార్, డి. శకుంతల, ఎం. ఉపేంద్ర శ్రీనివాస్, చుక్క హేమ ప్రసాద్, ట్రస్టీ సభ్యులు పాల్గొన్నారు. సుమారు 500 మంది రోగులు వైద్య సేవలు అందుకున్నారు.

28న బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థాని మున్సిపల్ ఆస్తులకు సంబంధించి తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్దగల కొబ్బరి, మామిడి, జీడి చెట్ల ఫలసాయాన్ని జులై నుంచి 2027 జూన్ వరకు అనుభవించే హక్కు పొందేందుకు బహిరంగ వేలం పాటను ఈనెల 28న ఉదయం 11.30 గంటలకు వేలం పాటు జరుగునని మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారి రూబేను దిబ్బ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కె .శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనుమతి పొందిన వారితో గానీ, రెవెన్యూ విభాగం అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాటను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు లక్ష రూపాయలు సాల్విన్స్ ధ్రువీకరణ పత్రాలతో పాటు రూ.75 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. అదనపు సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయం పనిచేసిన వేళల్లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీలకు 21 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జీ స్టేడియంలో ఆదివారం సీనియర్ జిల్లా స్థాయి త్రైక్వాండో పోటీలు, 40వ రాష్ట్రస్థాయి సీనియర్ త్త్రైక్వాండో పోటీలకు ఎంపిక పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయి పోటీలకు 21 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో 50మంది పాల్గొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ విజేతలు ఈనెల 31, సెప్టెంబర్ 1 వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా త్రైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డివి చారి తెలిపారు.



స్వామి థియేటర్ జంక్షన్ వద్ద శిథిలమైన కల్వర్టు, రోడ్డు మధ్య ఏర్పడ్డ గొయ్యి

ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

'వడ్డించేవాడు మనవాడైతే కడవరకు భుజించవచ్చు అన్న చందాన అధికారి మనవాడైతే పనుల్లో నాణ్యత లేకపోయినా ఫర్వాలేదు. చక చక పనులు చేసి చకచకా బిల్లులు చెల్లించుకోవచ్చన్న రీతిలో గుత్తేదారులు ఉన్నారు. ఇందుకు నిదర్శనం వీరఘట్టం ప్రధాన రహదారి నిర్మాణ పనులే....

మండల కేంద్రంలోని వట్టిగెడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటర్ల దూరంలో ఉపాధి హామీ చట్టం ద్వారా రూ 5.5 కోట్లతో ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు చేపట్టారు. సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది మే 2న ఆగమేఘాలుగా బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఆర్ అండ్ బి అధికారులు పర్యవేక్షణ లేకపోయినప్పటికీ గుత్తేదారులే అధికారులుగా ఏర్పడి రాత్రింబవళ్ళు ఏదోలా పనులు చేపట్టారు. పనులు చేపట్టి దాదాపుగా మూడు నెలలు కావస్తున్నప్పటికీ అంబేద్కర్ జంక్షన్, స్వామి థియేటర్ వద్ద రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా రహదారికి మధ్య డివైడర్లులో కూడా పనుల నాణ్యత లేకపోవడంతో ఇటీవల కాలంలో వాహనాల ఢీకొనడంతో నాణ్యత డొల్లతనం బయటపడింది, ఇంత జరుగుతున్నప్పటికీ కనీసం ఆర్ అండ్ బి అధికారుల్లో చలనం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. వీరఘట్టం ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల కోసం మూడు దశాబ్దాల నుండి ప్రజలు ఆశతో చూస్తున్న రహదారి నిర్మాణ పనులు ఆదిలోనే శిథిలావస్థకు చేరుకోవడంతో ఎన్నాళ్ళు ఈ రహదారి ఉండదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి గుత్తేదారుపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆదివారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు విక్రమ్ అరుణ భాస్కర్, కార్యదర్శిగా పట్టిక చంద్రమోహన్, కోశాధికారి అరుణశ్రీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యవర్గ పరిశీలకులు చల్లా జగదీష్ బల్ల రమేష్ ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు.



తలుపుల్లేని మరుగుదొడ్లు

ఎంపిడిఒ కార్యాలయంలో సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోనే మౌలిక సౌకర్యాలు కరవుయ్యాయి. ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల తలుపులు అధ్వానంగా తయారవ్వడంతో కార్యాలయానికి వివిధ రకాలైన పనులకు వచ్చిన ఫిర్యాదుదారులకు అవస్థలు తప్పడం లేదు. మరుగుదొడ్ల తలుపు సక్రమంగా లేనందున కాలకృత్యాలు తీర్చుకునేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన తలుపులు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దయానిధిపురంలో క్లోరినేషన్ పనులు చేయిస్తున్న సిబ్బంది

దయానిధిపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని దయానిధిపువురంలో గల గ్రామాలైన జయంతరాయిపురం, పూను అచ్చంపేట, దయానిధి పురం గ్రామాల్లో సర్పంచ్ తెంటు రామారావు, కార్యదర్శి ఎ.అశోక్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేశారు. గ్రామంలో అంటు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటిస్తూ పూడికతీతలు, నీళ్ల ట్యాంకుల్లో క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సింహాచలం, ప్రసాద్‌తో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గుమడ వద్ద పూడ్చిన గొయ్యిలను చూపుతున్న సిపిఎం నాయకులు

రహదారి మరమ్మతు పనులకు మోక్షం

ప్రజాశక్తి - కొమరాడ

ఎట్టకేలకు పార్వతీపురం-కూనేరు మధ్య గల అంతర్‌రాష్ట్ర రోడ్డు మరమ్మతు పనులు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బి అధికారులు ఆదివారం మరమ్మతులు పనులు చేపట్టారు. స్థానిక తహశీల్దార్ రమేష్ ఆర్‌అండ్‌బి జెఇ రాజేందర్‌తో మాట్లాడి ట్రాక్టర్లను ఏర్పాటు చేసి గుమడ వద్ద ఏర్పాటైన గోతులను కప్పి రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఈ మేరకు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి రోడ్డు మరమ్మతులు చేపట్టినందుకు ఎమ్మెల్యేకు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అర్తాం, గంగిరేగువలస, కోటిపాం, కొమరాడ, బంగారంపేట, ఇందిరానగరం, చోలపదం, కూనేరు వద్ద గల గొయ్యిలను కూడా పూడ్చి అటు వాహనదారులకు, ఇటు ప్రయాణికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరారు. అలాగే శనివారం గుమడ వద్ద సిపిఎం, రాయగడ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 10న బంద్ నిర్వహిస్తామని అధికారులకు స్పందించారు.

మిగులు ఉపాధ్యాయులుంటే మెగా డిఎస్‌సి ఎలా ? : పిఆర్‌టియు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు అధిక సంఖ్యలో మిగులు ఉపాధ్యాయులుగా ఉన్నారని గుర్తించి సర్దుబాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, ఇటువంటి పరిస్థితుల్లో 16 వేలకు పైగా ఉపాధ్యాయులను నియమిస్తామని మెగా డీఎస్సీపై మొదటి సంతకం ఎలా చేశారని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఇప్పటికీ ఉన్న జీవోల ప్రకారం సుమారు 9వేల పోస్టులు మిగులుగా ఉన్నట్లు గుర్తించారన్నారు. రమారమి వెయ్యి పోస్టులు వరకూ సర్దుబాటు చేయదల్చారని, అయినప్పటికీ ఇప్పటికి సర్దుబాటు ప్రక్రియ పూర్తికాలేదని పేర్కొన్నారు. అది ఎప్పటికి అవుతుందో తెలియని పరిస్థితి అన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని సమీక్షించాలని సూర్యనారాయణ తెలిపారు. గత ప్రభుత్వ విధానాలనే ఇప్పటికీ అధికారులు చేయడం వల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడకపోగా క్షీణించే ప్రమాదం ఉందని నాయకులు తెలిపారు. ఇటువంటి తరుణంలో మెగా డీఎస్సీ ఎలా సాధ్యపడుతుందని సూర్యనారాయణ అన్నారు. 117 జీవోను రద్దు చేసి ఒకటి నుండి ఐదు తరగతి వరకు ప్రాథమిక విద్యను 6 నుండి పదో తరగతి వరకు సెకండరీ విద్యను తెలుగు ఆంగ్లము మాధ్యమాలను సమాంతరంగా నిర్వహించాలని సూర్యనారాయణ సూచించారు. ఎన్నో ఆశలతో డీఎస్సీ నిర్వహిస్తారని ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయులకు నిరాశ మిగిల్చొద్దని సూర్య నారాయణ హితవు పలికారు.

ప్రాణాలను కాపాడే బాధ్యత వైద్యులదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రజల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత వైద్యులపై ఎంతైనా ఉందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం ఆమె బిత్రపాడు పంచాయతీ బట్లభద్రలో విషజ్వరంతో మృతి చెందిన మేరువ దుర్గ, చైతన్య వివరాలను జిల్లా వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యత వైద్యులపై ఉందని ఆమె స్పష్టం చేశారు. అందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే జ్వర పీడితులు ఇంకా ఉన్నారని, పూర్తిస్థాయిలో తగ్గేంత వరకు మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన మందులు సరఫరా చేయాలని ఆమె వైద్యులకు సూచించారు. అనంతరం బాధితుడు మేరువ పరంధామను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్మోహనరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

డెంగీ జ్వరంతో మృత్యువాత పడ్డ బట్లభద్రకు చెందిన మేరువ పరంధామ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆదివారం పరామర్శించారు. భార్యా , కుమార్తె ఒకే రోజున చనిపోయిన ఘటన చాలా బాధాకరమైందని ఆమె విచారం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు తెలిసినప్పటికీ , ఇరువురు మరణాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె తెలిపారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించాలని ఆమె కోరారు. వారం రోజులుగా గ్రామంలో జ్వర పీడితులు సంఖ్య పెరుగుతుందని తెలిసి వైద్యశాఖ ఎందుకు నిర్లక్ష్య వైఖరి అవలంబించిందని ఆమె వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.25వేలు నగదును ఆర్థిక సాయంగా అందిస్తూ, భార్యను కుమార్తెను పోగొట్టుకున్న మేరువ పరంధామకు ధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మూడడ్ల శశి కళ, సర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి -సీతంపేట

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే బాధ్యులపై చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.జగదీష్ నాయుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఎన్‌టియార్ పార్క్ వద్ద యువతకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడం గురించి అవగాహన కలిగించారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లైసెన్స్, సి-బుక్, ఇన్సూరెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వీరఘట్టం : మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై జి.కళాధర్ వాహనదారులను హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలో వాహనాలు తనిఖీ చేసిన సందర్భంగా వాహనదారులతో మాట్లాడారు. తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కృష్ణంనాయుడు, సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

సాలూరు: వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. పట్టణంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని చెప్పారు. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సీతారాములు, పోలీసులు పాల్గొన్నారు.

సీతానగరం : ప్రతి మోటారు వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని జోగింపేట జంక్షన్‌లో ఆదివారం వాహనదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ డ్రైవింగ్ చేసిన వారు తప్పక హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నుంచి దూరం చేయొచ్చు అన్నారు. మైనర్ బాలలకు వాహనం ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



సీతంపేటలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగదీష్‌నాయుడు

రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో మామిడిపల్లి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఐదో తరగతి చదువుతున్న ఇల్లపు దొర గీత రాష్ట్ర స్థాయి ఖేల్ కూద్ (ఆటల పోటీలు) పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, క్షేత్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల కమిటీ సభ్యులు, ఆచార్యులు, మాతాజీలు విద్యార్థినిని అభినందించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్, భారతీయ విజ్ఞాన కేంద్రం, విజ్ఞాన విహార పాఠశాలల విద్యార్థుల మధ్య పలు రకాల ఆటల పోటీలు అంచెల వారీగా పాఠశాల, జిల్లా స్థాయిలో నిర్వహించారు. ఇందులో రాణించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి ఇటీవల నరసరావుపేటలో పోటీలు జరిపించారు. కాగా రాష్ట్ర స్థాయి 600 వందల మీటర్ల పరుగు పందెం (అథ్లెట్)బాలల విభాగంలో గీత ప్రథమ స్థానంలో నిలిచి, క్షేత్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి పాఠశాలకు వచ్చింది. తమ పాఠశాల విద్యార్థి గీత ప్రతిభను శిశు మందిర్ ప్రధాన ఆచార్యులు వేముల గౌరినాయుడు కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ మేరకు గీతను అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ఏడాది జరిగిన జిల్లా స్థాయి పోటీలో రాణించిన గీత రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం అద్భుతంగా రాణించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఐదు సమితుల విద్యార్థుల మధ్య జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారి మధ్య వచ్చే నెల 15, 16వ తేదీల్లో విజయవాడ కేంద్రంగా క్షేత్ర స్థాయి (ఎపి, తెలంగాణ, కర్ణాటక) పోటీలను నిర్వహిస్తారని, అందులో గీత పాల్గొంటుందన్నారు. ఇది ఇలా ఉండగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 120పాఠశాలలకు చెందిన 750మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారన్నారు. క్షేత్ర స్థాయి పోటీల్లో సైతం గీత రాణిస్తుందన్న ఆశా భావాన్ని ఆచార్యులు, కమిటీ సభ్యులు వ్యక్తం చేశారు.



విద్యార్థిని గీతను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కుమార్తెను చూసేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం
- ఉప్పర నాయుడువలసలో విషాదం

ప్రజాశక్తి-రేగిడి

కళాశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటున్న కుమార్తెను చూసేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందిన ఘటన ఆదివారం రణస్థలం వద్ద చోటు చేసుకుంది. కుమార్తెకు బాగా చదువుకోవాలని విద్యాబుద్ధులు చెప్పి ఇంటికి తిరుగుముఖం పట్టిన వారిద్దరినీ అంతలోనే లారీ మృత్యువు రూపంలో కబళించింది. దీంతో రేగిడి మండలం ఉప్పరనాయుడువలసలో విషాదం అలముకుంది.

గ్రామానికి చెందిన కరణం రామకృష్ణకు భార్య రత్నకుమారి, కుమార్తె సాత్విక, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. రామకృష్ణ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కష్టమైనా ఇద్దరి పిల్లలనూ బాగా చదివించాలనే ఉద్దేశంతో అప్పులు చేసి ప్రైవేటు కళాశాలల్లో చదివిస్తున్నాడు. కుమార్తె భోగాపురం వద్ద హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో చదువు కుంటోంది. కుమారుడు విశాఖలో డిగ్రీ చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం కుమారుడు సాయికిరణ్ ఇంటికి వచ్చాడు. ఆదివారం కావడంతో తండ్రితో కలిసి చెల్లెను చూసేందుకు ద్విచక్ర వాహనంపై భోగాపురం వెళ్లారు. సాత్వికను కలిసి బాగా చదువుకోవాలని చెప్పి ఇంటికి తిరుగు పయనమయ్యారు. రణస్థలం మండలం బంటుపల్లి జంక్షన్ బీరు ఫ్యాక్టరీ వద్ద లారీ బైక్‌ను ఢీకొనడంతో తండ్రి కరణం రామకష్ణ (52), కుమారుడు సాయికిరణ్ (21) దుర్మరణం చెందారు. స్థానికులు ప్రమాద స్థలం వద్దకు చేరుకొని రామకష్ణ జేబులో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా అడ్రస్సు కనుక్కొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నంలో డిగ్రీ చదువుతున్న రామకష్ణ కుమారుడు సాయి కిరణ్ రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. చెల్లిని చూసేందుకు వెళ్లి వద్దామని తండ్రి, కుమారుడు శనివారం రాత్రి అనుకున్నారు.. ఆదివారం భోగాపురం వెళ్లి బాగా చదువుకోవాలని కుమార్తె సాత్వికకు చెప్పి తిరుగు ముఖం పట్టారు. ఇంతలోనే లారీ రూపంలో మృత్యువు వారిని బలితీసు కొంది. మృత దేహాలను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం పోలీసులు తరలించారు. భర్త కుమారుడు మృతితో రత్నకుమారి కన్నీరుమున్నీరైంది. రణస్థలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన తండ్రి, కొడుకులు రామకృష్ణ, సాయికిరణ్

ప్రమాదకరంగా వంతెనలు .. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని మక్కువ సువర్ణముఖీ నదిపైన మార్కొండపుట్టి సమీపంలోని చిట్టిగెడ్డ పైన ఉన్న వంతెనలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో తెలియదని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. చిట్టిగెడ్డపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బట్టివలస, కాకులవానివలస, గైశీల, నంద తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలు అధికంగా కురవడంతో గెడ్డ ఉధృతిపై మరింత గోతులమయంగా వంతెన మారింది. అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదని గిరిజన ప్రజలు వాపోతున్నారు. సువర్ణముఖి నదిపై ఉన్న వంతెన రిటర్నింగ్‌వాల్ పూర్తిగా పాడైపోయినా ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వంతెన మధ్య భాగంలో పలుచోట్ల పెచ్చులు ఊడి గోతులుగా ఏర్పడింది. మండల కేంద్రానికి ప్రధాన వంతెన కావడంతో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురి అవుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి సువర్ణముఖి నది వంతెనకు తాత్కాలిక మరమ్మత్తులు చేయాలని, అలాగే చిట్టిగెడ్డపై వంతెన పూర్తిస్థాయిలో నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు



ప్రమాదకరంగా మారిన చిట్టిగెడ్డ వంతెన

జీడి రైతులకు భరోసా ఏదీ : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో జీడి పండించే గిరిజన రైతులకు భరోసా లేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల గిరిజన రైతులు పండించిన జీడి పంట రైతులకు నష్టాలు, దళారులకు లాభాలు కలిగే పరిస్థితి ఉందన్నారు. జీడి పరిశ్రమ ఏర్పాటుకు పాలకులు స్పందించినప్పటికీ ఫలితం శూన్యమని అన్నారు. రెండేళ్ల క్రితం వెలుగు ఎపిడి కొమరాడ వచ్చి ఇక్కడ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని, గిరిజన రైతులెవరూ జీడి పిక్కలు బయట అమ్మొద్దని, తామే గిట్టుబాటు ధరంచి కల్పించి కొనుగోలు చేస్తామని చెప్పారని, ఆ తర్వాత ఎక్కడా జాడ కనిపించని పరిస్థితి ఉందని అన్నారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా గిరిజన రైతులను అన్ని విధాలా ప్రోత్సహించేలా ఎరువులు, విత్తనాలతో పాటు జీడి తోటల అభివృద్ధికి కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

మూతపడిన పాఠశాల తెరవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలోని మూతపడిన పాఠశాలను తెరవాలని మండల పరిధిలోని గదభవలస గిరిజన గ్రామ సర్పంచి రాయల దాలమ్మతో పాటు గ్రామస్తులు ఆదివారం విలేకరుల వద్ద వాపోయారు. గ్రామంలో సుమారు 25మంది విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాల మూసివేయడంతో సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కత్తుల కవిటి గ్రామ పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆరోపించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థుల మరిన్ని అవస్థలకు గురికావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి మూతపడిన పాఠశాలను తెరిపించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లీ కూతుళ్ల మరణాల పై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో వ్యాధుల బారినపడుతూ జరుగుతున్న మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం 24 గంటల్లో తల్లీ కూమార్తెలు మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న, అందించే వైద్య సేవలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గత నెలలో గుమ్మ లక్ష్మీ పురంలో ఒక మెడికల్ షాపు యజమాని చేసిన వైద్యం వల్ల కురుపాం మండలం గుమ్మ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందిన సంఘటనపై ఏం చర్యలు తీసుకున్నారో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో సైతం సరైన వైద్య సేవలందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - కురుపాం

విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో మొండెంఖల్‌లోని గౌడు వీధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం ఒడిశాలోని పర్లాకిమిడికి చెందిన గౌడు బుజ్జిలు (సుధారాణి) తన కన్నవారి స్వగ్రామమైన మొండెంఖల్ వచ్చింది. మెయిన్ బోర్డు పక్కనే ఉన్న జియో తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఆమె విద్యుత్ షాక్‌కు గురైంది. గీత భర్త ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆమెక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా తమ ఇళ్లకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతుందని బాగు చేయమని పలుమార్లు లైన్ మెన్ ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో లైన్‌మాన్ సమస్య పరిష్కరించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మృతి చెందిన బుజ్జిలు

గిరిజన గ్రామాల్లో అవగాహన శిబిరాలు

11 మండలాల్లోని 53 గ్రామాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఆదిమ గిరిజన తెగల అభివృద్ధికి ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పి.ఎం.జన్‌మన్) కార్యక్రమంలో భాగంగా అర్హులైన ఆదివాసీ గిరిజన తెగలకు కేంద్ర పథకాలను అందించేందుకు ఆదివారం గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 11 మండలాల్లో 53 గ్రామాల్లో ఆదిమ తెగలకు సంబంధించిన గిరిజనులు నివసిస్తున్నట్లు గుర్తించినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారుల నేతృత్వంలో ఈనెల 25 నుంచి అవగాహన శిబిరాలు నిర్వహించి పథకాలకు అర్హులైన గిరిజన లబ్దిదారుల గుర్తింపు, అవసరమైన ఆరు రకాల గుర్తింపుకార్డులను అందించడం, ధ్రువపత్రాల జారీ జరుగుతుందన్నారు. ఈ శిబిరాల ద్వారా ఆధార్ కార్డులు లేని వారికి వాటిని జారీచేయడం, పి.ఎం.జన్‌ధన్ కింద బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీకి పేర్లు నమోదు, గిరిజనులకు కుల ధ్రువపత్రాలు జారీ, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు జారీ వంటి ఆరు కార్యక్రమాలను అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి అందించేలా చర్యలు చేపడతారని పేర్కొన్నారు. వీటితోపాటు గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు, మహిళలకు ప్రసూతి ప్రోత్సహకాల మంజూరు, కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ, కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రయోజనాలు కల్పించడం వంటి కార్యక్రమాలను కూడామండల, గ్రామస్థాయి బందాలు చేపడతాయని తెలిపారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్మాణం, గృహ నిర్మాణం, కమ్యూనికేషన్ సౌకర్యాల కల్పన తదితర 11 రకాల వసతులను కేంద్ర పథకాల అనుసంధానం ద్వారా కల్పించేందుకు ఆయా శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. పిఎం జన్ మన్ కార్యక్రమం అమలుకు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామానందంను నియమించారు.

పైడితల్లమ్మను దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

విజయనగరం: దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్య నారాయణ ఆదివారం పైడితల్లి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అభివద్ధి పనులపై ఆలయ ఇఒ డివివి ప్రసాద రావు వివరించారు. అనంతరం ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తో సమావేశమై అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లా యంత్రాంగం ద్వారా ఉత్సవాల నిర్వహణ కోసం చేయనున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. దేవాదాయ శాఖ నుంచి అందించాల్సిన సహకారంపై తెలిపారు. జిల్లాలో దేవాదాయ భూముల పరిస్థితిపై కలెక్టర్ చర్చించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, విశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష, డిఇ కె.వి.సి.కృష్ణ, డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచార్యులు, పైడితల్లి అమ్మవారి ఆలయ ఇఒ డి.వి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.